janodaya

# జనోదయ

RNI No - APTEL/2022/81596

కరీంనగర్ ఆదివారం 19.04.2026 సంపుటి : 03 సంచిక : 132 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Sunday 19.04.2026 Volume: 03 Issue 132 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక







## బౌలర్ల భళా.. చెన్నైకి చెక్ పెట్టిన సన్‌రైజర్స్

ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద మళ్లీ గర్జించింది. గత మ్యాచ్‌లో రాజస్థాన్‌పై చెలరేగిన బౌలర్లు ఈసారి పంజా విసరడంతో చెన్నై సూపర్ కింగ్స్(జూఖ)ను అలవోకగా ఓడించింది. బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ(59), క్లాసెన్(59) అర్ధ శతకాలతో విరుచుకుపడగా.. ఇషాన్ మలింగ(3-29), నితీశ్ రెడ్డి(2-31)లు బంతితో రాణించారు. భారీ ఛేదనలో టాపార్డర్ విఫలమైనా ఆయుశ్ మాత్రే(30), శివం దూబే(21) పోరాడినా సీఎస్కేను గెలపించలేక పోయారు. మూడో విజయంతో ప్లే ఆఫ్స్ ఆశలు నిలబెట్టుకుంది ఆరెంజ్ ఆర్మీ. పంతొమ్మి దో సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో విజయంతో మురిసింది. సొంత మైదానంలో బ్యాటర్లు, బౌలర్లు రాణించగా రెండు విజయాలతో జోరుమీదున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను మట్టికరిపించింది. భారీ ఛేదనను ధాటిగా మొదలెట్టిన చెన్నై సూపర్ కింగ్స్‌ను నితీశ్ రెడ్డి(2-31) ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఫామ్ అందుకున్న శాంసన్(7)ను ఔట్ చేసి అతడు బ్రేకివ్వగా.. ఇంప్యాక్ట్ సబ్ ఆయుశ్ మాత్రే(30) వస్తూనే గత మ్యాచ్ హీరో ప్రఫుల్ హింగేను ఉతికేస్తూ ఐదు ఫోర్లు రాబట్టాడు. ధాటిగా ఆడుతున్న మాత్రేను క్లాసెన్ డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు.. కాసేపటికే రుతురాజ్ గైక్వాడ్(19)ను ఇషాన్ మలింగ(3-29) వెనక్కి పంపాడు. సర్ఫరాజ్ ఖాన్(25) సైతం ఔటవ్వగా.. డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(0)ను ఔట్ చేసి శివాంగ్ ఐదో వికెట్ అందించాడు.అనంతరం.. మాథ్యూ షార్ట్(34) జతగా శివం దూబే(21) జట్టును గెలిపించేం దుకు ప్రయత్నించాడు. కానీ, అనికేత్ వర్మ సూపర్ క్యాచ్ పట్టడంతో షార్ట్ ఆరో వికెట్‌గా డగౌట్ చేరాడు. అయినా దూబే క్రీజులో ఉండడంతో గెలుపుపై ధీమాతో ఉన్న చెన్నై ఆశలపై షకీబ్ నీళ్లు చల్లాడు. 17వ ఓవర్లో దూబేను బౌల్డ్ చేసిన ఈ యంగ్‌స్టర్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. నితీశ్ ఓవర్లో అన్షుల్ (12) సిక్సర్ బాదగా ఆఖరి ఓవర్లో చెన్నై విజయానికి 18 పరుగులు అవసరమయ్యాయి. ప్రఫుల్ వికెట్ తీసి రన్స్ మాత్రమే ఇవ్వడంతో సన్‌రైజర్స్ 10 పరుగుల తేడాతో గెలుపొందింది.






## దిగజారుతున్న అగ్రశ్రేణి మీడియా




5లో..

### పూర్తిగా పార్టీల రంగేసుకున్న వైనం

### ఇలాంటి మీడియాలకు వందల కోట్ల ప్రజాధనం పంచిపెట్టడం సబబేనా?

### ముసుగులు తొలగిన పాత్రికేయం

### ఛీ కొడుతున్న జనం

సీఈసీ తొలగింపునకు

## మళ్లీ విపక్షాల నోటీస్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** తమ మునుపటి నోటీసులు తిరస్కరణకు గురైనప్పటికీ వెరవకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ తాజా ప్రయత్నానికి విపక్షాలు సిద్ధమవుతున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం పలు విపక్ష పార్టీల నాయకులు చర్చలు జరుపు తున్నట్టు సమాచారం.అలాగే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాది పార్టీ, డీఎంకే సహా వివిధ పార్టీలకు చెందిన కనీసం ఐదుగురు సీనియర్ ఎంపీలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు ప్రక్రియను ప్రారంభించేందుకు కొత్త నోటీస్ ముసాయిదాను రూపొం దించే పనిలో ఉన్నారు.

## ‘కృత్రిమ మేధతో ఆందోళన వద్దు



**బెంగళూర్:** కృత్రిమేధ అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ (సీజేఐ) కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలంటే అంతర్గత పరిమితులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఏఐ గురించి భయపడొద్దని న్యాయాధికారులకు సూచించారు. ‘టెక్నాలజీ సలహాలు ఇవ్వడంలో ఉపయోగపడుతుంది. మనుషులకు ప్రత్యామ్నాయం కాదు. న్యాయవ్యవస్థలో ఏఐ అనుసంధానం చేయాలంటే సమతుల్యతను పాటించాలి. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, మానవ మేధస్సు అనుభవాన్ని ఉపయోగించాలి’ అని సీజేఐ అన్నారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి




2లో..

ఈ నెల 20వ తేదీన మంథని నియోజకవర్గంలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని మెడిగడ్డ ముఖ్యమంత్రి పర్యటనను రైతులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు.

### రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి, మంత్రులు

### మంథనిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

# ఏఐ వినియోగంతో పనితీరులో వేగం,సామర్థ్యం పెరుగుతుంది

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ఏఐ సాంకేతికతను ప్రతి ఒక్కరూ అవలంబించాలి

శిక్షణలను సద్వినియోగం చేసుకుని పనిలో ప్రతిఫలింపజేయాలి

మంథని : పెద్దపల్లి, ఏప్రిల్ 18 (జనోదయ)





ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.ప్రతి అధికారి,సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.శనివారం జిల్లాలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు.ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్,సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కొరత నివారణ చర్యలు చేపట్టిన

# మున్సిపల్ చైర్మన్



జనోదయ : మంథని

99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగానీటి కొరత నివారణ చర్యలను మున్సిపల్ చైర్మన్, పాలక వర్గ సభ్యులు శనివారం చేపట్టారు.వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని నీటి నివారణ చర్యల్లో భాగంగా ప్రజల సౌకర్యార్థం 12వ వార్డులో నీటి బోర్ల పనులకు మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, పాలక వర్గ సభ్యులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి, మంత్రులు

మంథనిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

జనోదయ : మంథని






ఈ నెల 20వ తేదీన మంథని నియోజకవర్గంలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని మెడిగడ్డ ముఖ్యమంత్రి పర్యటను రైతులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రాష్ట్ర మంత్రులు కాటారం మండలంలోని నస్తూరి పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొంటారని శనివారం మంథనిలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు.ముఖ్యమంత్రి బహిరంగ సభకు మంథని నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు రైతులను పెద్ద ఎత్తున తరలించాలని, గ్రామాలలోని సర్పంచులు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బహిరంగ సభలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి సూచించారు. అలాగే రామగుండం, పెద్ద పెల్లి, ధర్మపురి నియోజకవర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున రైతులు ప్రజలు తరలి వస్తారని, బహిరంగ సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని, వేసవికాలం దృష్ట్యా నీటి కొరత లేకుండా చూస్తున్నామని, ప్రజలు అధికారులకు సహకరించాలని మంత్రి కోరారు. ఈ బహిరంగ సభ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు మొదలవుతుందని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు,జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి,మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం, ఎస్సి సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు, మంథని,ముత్తారం, రామగిరి, కమాన్పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐలి ప్రసాద్, దొడ్డ బాలాజీ, రోడ్డ బాబు,సయ్యద్ అన్వర్, మంథని, కమాన్ పూర్ ఏఎంసీ చైర్మన్లు కుడుదల వెంకన్న, వైనాల రాజు, కమాన్పూర్, ముత్తారం, మంథని యూత్ అధ్యక్షులు రెబల్ రాజకుమార్, బక్కత ట్ల వినీత్ యాదవ్, సాధుల శ్రీకాంత్, సర్పంచులు ఉపసర్పంచులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రామగిరి పోలీసుల అప్రమత్తతతో విజయవంతమైన ఆపరేషన్




మంథని : రామగిరి ఏప్రిల్ 18 (జనోదయ)

మంథని సర్కిల్ పరిధిలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను రామగిరి పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు సీఐ రాజు తెలిపారు.శనివారం కల్వచర్ల శివారులో పెట్రోలింగ్ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.అరెస్టయినవారిలో దాసరి రవి (40), వనం పాపయ్య (31), వనం నగేష్ (30) ఉన్నారు.వీరు పగటి పూట ఇళ్లను గమనించి, రాత్రివేళ తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దొంగిలించేవారని పోలీసులు తెలిపారు. కల్వచర్ల, ఓడెడు, ముత్తారం, రత్నపూర్ ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి కారు, టాటా సెప్టిక్ ట్యాంకర్, జూపిటర్ స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆభరణాలు బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలని, అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. ఈ ఆపరేషన్లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని అభినందించారు.

# తెలంగాణలో త్వరలో జడ్పిటిసి,ఎంపీటీసీ, ఎన్నికలు

జనోదయ : మంథని

తెలంగాణలో జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాల,జడ్పీటీసీ,ఎంపీటీసీ,ఎన్నికలకు రంగం సిద్ధమైంది, ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల ని రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో మరోసారి తెలం గాణలో ఎన్నికల నగరా మోగనుంది.గత డిసెంబర్ నెలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పూర్తి కాగా.. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నిక లు కూడా నిర్వహించారు. తాజాగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న మండల, జిల్లా ప్రజాపరిషత్లకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా తయారీకి శుక్రవారం సాయంత్రం కీలక ఆదేశాలు జారీ అయ్యాయి.పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరిగే అవకాశాలుఉన్నాయి. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేసింది.కేంద్ర ఎన్నికల సంఘం 2025 జూలై 10 నుండి 2026 ఫిబ్రవరి 5 వరకు సమీకరించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఈ ప్రక్రియ కొనసాగనుంది.నియోజకవర్గాల్లోని అద నపు ఓటర్లను గుర్తించి, వారిని సంబంధిత పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల వారీగా వర్గీకరిం చాలని అధికారులు ఆదేశించారు.ఈ డేటాను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ యూజర్ మాన్యువల్ ప్రకారం పోలింగ్ కేంద్రాలకు అనుసంధానించాల్సి ఉంటుంది. డేటాలో ఏవైనా లోపాలు ఉంటే ఈ నెల 23 వ తేదీలోపు నివేదించాల ని,ఆ తర్వాత ముసాయి దా జాబితాలను విడుదల చేసి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని ఎస్ఈసీ తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.



# మహిళా రిజర్వేషన్ బిల్లును బేషరతుగా అమలు చేయాలి

ఎంసిపిఐ(యు) డిమాండ్

ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం

31వ రాజ్యాంగ సవరణపై నిరసన

వరంగల్‌లో ఎంసిపిఐ(యు) ర్యాలీ

జనోదయ : వరంగల్ ప్రతినిధి

దేశ సమైక్యత, సమగ్రతను దెబ్బతీసే విధంగా రాజ్యాంగ సవరణలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోందని ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో తీసుకువచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)-ఎంసిపిఐ(యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 31వ రాజ్యాంగ సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ.. వరంగల్ పార్టీ ఆఫీసు నుంచి హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గాదగోని రవి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి దేశ సమైక్యతను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. అశాస్త్రీయ పద్ధతిలో డీలిమిటేషన్ చేపట్టేందుకు 31వ రాజ్యాంగ సవరణకు తెరలేపిందని విమర్శించారు. 2023లో తీసుకువచ్చిన 33% మహిళా రిజర్వేషన్ బిల్లును బేషరతుగా అమలు చేయాల్సింది పోయి డీలిమిటేషన్‌కు ముడిపెట్టి అనైక్యత సృష్టించేందుకు, రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశానికి హాని కలిగించే విధంగా డీలిమిటేషన్ తీసుకురావడం, దానికి మహిళా రిజర్వేషన్లు లింకు పెట్టడం సమంజసం కాదని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ రాజకీయ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కేంద్రం ఇప్పటికైనా రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, లేకపోతే బీజేపీకి వత్తాసు పలికే పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, ఎన్. రెడ్డి హంసారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వా





## రామగుండం నగరాన్ని

# చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

రామగుండం మేయర్ మహంకాళి స్వామి

జనోదయ : గోదావరిఖని, ఏప్రిల్ 18

ఎం ఎల్ ఎ సూచనల మేరకు రామగుండం నగర పునర్నిర్మాణంలో భాగంగా చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తున్నదని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. శనివారం 41 వ డివిజన్ ఎల్ బి నగర్ లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,స్థానిక కార్పొరేటర్ మార్కాపురి సూర్యతో కలిసి పర్యటించారు. ఈ సంధర్భంగా డివిజన్ లోని ప్రదాన మురుగునీటి కాలువతో పాటు ఇతర కాలువల్లో కూడా పూడిక తీయించి నీళ్ళు సాఫీగా ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. కాలువలో ప్రవహానికి ఆటంకం కలిగిస్తూ పెరిగిన పిచ్చి చెట్లను, కొమ్మలను తొలగించడంలో మేయర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు కూడా పాలు పంచుకున్నారు.బ్లేడ్ మిషన్ సహాయంతో చెట్ల కొమ్మలను నరకడంలో సహకరించారు. కాలువలో చెత్త వేయకుండా మునిసిపల్ సిబ్బందికి ఇవ్వాలని స్థానికులకు తాను స్వయంగా చెప్పడంతో పాటు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించాలని మెప్మా ఆర్ పి లను మేయర్ ఆదేశించారు. ఇల్లు , శరీరం ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో తమ వీధిని కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్త బయట పడవేసే వారికి జరిమానాతో పాటు మునిసిపల్ సేవలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు,నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి,ఎస్ ఇ గురువీర్,ఇ ఇ.పి వి.రామన్,డి ఇ.ఇ లు జగదీష్,అఫ్రోజ్,ఎ ఇ మనోజ్,టి పి ఎస్ నవీన్,టి పి బి ఓ కళ్యాణ్, ఎలెక్ట్రికల్ ఎ ఇ రాంజీ , సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని విధాలుగా అభివృద్ధి చేసే లక్ష్యంతో

# ముందుకు సాగుతున్నాం

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



జనోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 18:

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ శనివారం ఎల్‌బీ నగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కాలేజీ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత,వేగం,మరియు అవసరమైన సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం, పరుశురాం నగర్ వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ..విద్యా మరియు మౌలిక వసతుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, మరియు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కిసాన్ న్యాయ్ మహా ధర్నాకు

# వరంగల్ నుంచి భారీగా తరలిన యూత్ కాంగ్రెస్

జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ నేతృత్వంలో

సుమారు 500 మంది కార్యకర్తలు హైదరాబాద్‌కు పయనం

జనోదయ : వరంగల్ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న'కిసాన్ న్యాయ్ మహా ధర్నా'కార్యక్రమానికి వరంగల్ అర్బన్ జిల్లా నుండి యూత్ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు.500 మందితో రైలు యాత్ర: తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపు మేరకు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ నేతృత్వంలో సుమారు 500 మంది కార్యకర్తలు శనివారం ఉదయం కాజీపేట రైల్వే స్టేషన్ నుండి హైదరాబాద్‌కు బయలుదేరారు.నినాదాలతో హోరెత్తిన స్టేషన్: ఈ సందర్భంగా కాజీపేట స్టేషన్‌లో కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. అనంతరం దిలీప్ రాజ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల నడ్డి విరిచేలా చట్టాలను తీసుకువస్తోందని, రైతు పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన పలువురు నియోజకవర్గ అధ్యక్షులు, ముఖ్య నాయకులు మరియు అధిక సంఖ్యలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమ్మె సన్నాహకాల్లో

# మంథని డిపో సందర్శన



జనోదయ : మంథని

సమ్మె సన్నాహకాల్లో భాగంగా శనివారం రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మంథని డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.పి రెడ్డి, జిల్లా టీఎంయూ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, జిల్లా జేఏసీ కో-కన్వీనర్ కొమ్ము కొమురయ్య యాదవ్ పాల్గొన్నారు.జేఏసీ పిలుపు మేరకు కార్మికులు సమ్మెలో ముందుండాలని, చివరి దాకా పోరాటాన్ని విజయవంతం చేయాలని థామస్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్మికులను ఉత్సాహపరిచారు.మంథని డిపో జేఏసీ చైర్మన్ కేకే రెడ్డి, వైస్ చైర్మన్లు ఐలయ్య, ఖాదర్ తదితర కమిటీ సభ్యులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్‌లో ఐపీఎల్ బెట్టింగ్ దందా గుట్టురట్టు

**ఆర్గనైజర్‌తో పాటు నలుగురు అరెస్ట్**
**టాస్క్ ఫోర్స్ దాడులు రూ.1.02 లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం.పరారీలో ముగ్గురు**

జనోదయ : వరంగల్ ప్రతినిధి

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా గుట్టును వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం దాడులు నిర్వహించి ఆర్గనైజర్‌తో సహా నలుగురిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన టాస్క్ ఫోర్స్ బృందం మధ్యకోటకు చెందిన వ్యాపారి తాడెం భరత్ (33) అనే ఆర్గనైజర్‌ను, ఆటగాళ్లు ములుక శ్రీనివాస్, లౌద్య వెంకన్న, పైడి శ్రీధర్, వంగ రమేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు రూ. 1,02,000, 5 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ముగ్గురు పరారీ: ఈ కేసులో హంటర్ రోడ్ దుర్గా కాలనీకి చెందిన మిట్టపల్లి సం తోష్ కుమార్, శంబునిపేట విశ్వనాథ కాలనీకి చెందిన పూల శ్రీకాంత్ గణేష్, రంగారెడ్డి ఎల్బీ నగర్‌కు చెందిన ఆర్గనైజర్ రావుల దిలీప్ కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.అరెస్టైన ఆర్గనైజర్ పూర్తి వివరాలు.. తాడెం భరత్, తండ్రి కుమారస్వామి, 33 సం. మున్నూరుకాపు, వ్యాపారం, మధ్యకోట, వరంగల్. అరెస్టైన ఆటగాళ్ల వివరాలు.. 1. లౌద్య వెంకన్న, 36 సం., లంబాడా, కూలి, ఎస్ఆర్ నగర్, వరంగల్. 2. పైడి శ్రీధర్, 37 సం., ముదిరాజ్, వ్యాపారం, కొత్తవాడ, వరంగల్. 3. వంగ రమేష్, 52 సం., కురుమ, వ్యాపారం, కరీమాబాద్, వరంగల్. 4. ములుక శ్రీనివాస్, 40 సం., పద్మశాలి,ఎస్ఆర్ఆర్ తోట,వరంగల్.స్వాధీనం చేసుకున్న సొత్తుతో పాటు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ దాడు




ల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూధన్, ఇన్‌స్పెక్టర్ సరళ రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్, టాస్క్ ఫోర్స్ బృందం పాల్గొన్నారు.


మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు

బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి

వాట్సాప్ చేయండి:8074124190

జర్నలిస్టుల సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
Journalists Sankshema Sangam
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH
TRADE UNION



మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

జనోదయ



# దిగజారుతున్న అగ్రశ్రేణి మీడియా

**పూర్తిగా పార్టీల రంగేసుకున్న వైనం**

**ఇలాంటి మీడియాలకు వందల కోట్ల ప్రజాధనం పంచిపెట్టడం సబబేనా?**

**ముసుగులు తొలగిన పాత్రికేయం**

**ఛీ కొడుతున్న జనం**




జర్నలిజానికి ఓ ప్రమాణం అనేది ఉంటుంది. కట్టుబాట్లు ఉంటాయి.ఏది మంచి, ఏది చెడు? అనే విచక్షణతతోపాటు ప్రజాప్రయోజనమే అంతిమ లక్ష్యంగా ఉంటుంది.మీది ఏ పక్షం అంటే మాది ప్రజాపక్షం అని ధైర్యంగా చెప్పగలిగేదే జర్నలిజం.ప్రజలకు,ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యానికి కావలిగా నిలిచేదే మీడియా.ఇదంతా ఇప్పుడా? గతంలో పరిస్థితా? అనే ప్రశ్న వేస్తే.. గతంలో ఉన్న పరిస్థితే ఇది అని చెప్ప డానికి ఎలాంటి సందేహం అక్కర్లేదు. మరి ఇప్పుడు మీడియా పరిస్థితి ఏంటంటే? ప్రజామీడియా స్థానంలో పార్టీ మీడియా రాజ్యమేలుతోంది. కోట్ల రూపాయలను పార్టీల నుంచి వివిధ మార్గాల ద్వారా దండుకున్న కొన్ని పార్టీల మీడియాలు నేడు అగ్రశ్రేణి మీడియాలుగా చెలామణీ అవుతూ అసలు సిసలు పాత్రికేయం ఇదేనని విర్రవీగుతున్నాయి.తాము రాసిందే నిజం..తాము చూపిందే సత్యం అనే విపరీత ధోరణితో మొత్తం పాత్రికేయ వృత్తినే ప్రజల నోటితో ఛీకొట్టే స్థితికి దిగజార్చడం విచారించదగిన పరిణామం.ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే ఇప్పుడున్న మీడియాలో అగ్రశ్రేణి మీడియాలుగా చెలామణీ అవుతూ ప్రభుత్వాల నుంచి అన్ని రాయితీలు, ప్రకటనలు పొందున్న మీడియాల్లో నూటికి తొంభైతొమ్మిది శాతం పార్టీ మీడియాలే అని చెప్పుకోవడంలో ఎలాంటి సందేహం లేదు.అయితే పార్టీలకు మీడియాలు ఉండటంలో తప్పులేదు. తమ పార్టీ కార్యకలాపాలతో ప్రజలకు దగ్గరయి తాము అధికారాన్ని ఎలా  అందుకోవాలనే లక్ష్యంతో పార్టీలు తమ గొంతుకగా మీడియాలను ఏర్పాటు చేసుకుంటు న్నాయి. ఇలాంటి మీడియాల్లో అన్ని రకాల వార్తలు ఉంటాయని పాఠకుడు వెతుక్కోవడం అత్యాశే అవుతుంది. పత్రికలు అంటే అన్ని రకాలు,అన్ని వర్గాల గొంతుకగా నిలచేవే.అలాంటి మీడియాలకు ప్రజాహి తంగా పనిచేస్తున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వాలు కార్యాలయాల నిర్మాణాల కోసం స్థలాలు, అందులో పనిచేసే పాత్రికేయులకు అక్రిడేషన్లు, ఇతర ప్రభుత్వ పథకాలతోపాటు కోట్లాది రూపాయల పత్రికా ప్రకట నలను ఇస్తుంటాయి. ఇందులో ఎలాంటి తప్పుపట్టాల్సిన పనిలేదు. కానీ ప్రజల కోసం కాకుండా కేవలం పార్టీ ప్రయోజనాల కోసమే పత్రికలు, మీడియాలు నడిపితే ప్రభుత్వ రాయితీలు,ప్రకటనలు ఇవ్వచ్చా? అనే సందే హం ఇప్పుడు చర్చల్లో ఉన్నది.తమ పార్టీల ప్రయోజనం కోసం నిరంతరం తపించే మీడియాలకు అన్ని రాయితీలు ఇస్తూ కోట్లాది ప్రజాధనాన్ని ప్రకటనల పేరుతో దోచిపెడుతూ నిజంగా ప్రజల కోసం పనిచేసే పత్రికలను, మీడియాలను చిన్న చూపుచూస్తూ..అలాంటి మీడియాల్లో పనిచేసే పాత్రికేయులను అసలు మీరు జర్నలిస్టులు కానేకాదంటూ వివక్షత చూపెట్టడంపై నేడు పాత్రికేయ లోకంలో మెజార్టీ వర్గాలు భగ్గుమంటు న్నాయి. ఇదెక్కడి నీతి అంటూ ప్రశ్నిస్తున్నాయి. అయితే ఇదంతా ఒక ఎత్తయితే నేడు అగ్రశ్రేణి మీడియాలుగా చెప్పుకుంటూ తాము చెప్పిందే నిజం..చూపించిందే సత్యం అని విర్రవీగే మీడియాలు తమ స్థాయిని పూర్తిగా దిగజార్చుకున్నాయి. తమ ఇష్టమైన,తమకు దోచిపెట్టే నేత కోసం ప్రతీక్షణం భజన చేస్తూ తమకు గిట్టని నేతలపై బురదజల్లే క్రమంలో ఇటీవల ఈ మీడియాలు మరింత బరితెగించాయి. తాజాగా ఏపీలో వైసీపీ నేతల భార్యలపై ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ కొత్త పలుకు శీర్షికలో రాసిన వ్యాఖ్యలు ఎంత నీచంగా ఉన్నాయో చూశాం.ఇలాంటి వ్యాఖ్యలను చూస్తే వేమూరి రాధాకృష్ణ జర్నలిస్టా? లేక పార్టీ కండువా కప్పుకున్న కార్యకర్తనా?అనే అనుమానం కల్గుతుంది.అసలు అక్కడ అధికారంలో ఉన్న అధికార పక్షాన్ని విమర్శించాల్సిన రాధాకృష్ణ నిత్యం ప్రతిపక్షం మీద విమర్శలు చేయడం చూస్తే ఆయన నిష్పక్షపాతం ఏపాటిదో అర్థం అవుతుంది. ఇదిలా ఉంటే పెద్ద మీడియాల హెడ్డింగులు,థంబ్‌నైల్స్ చూస్తే  సోషల్ మీడియాలో కొన్ని బూతు చానెళ్ల స్థాయికి దిగజారాయనే విమర్శలు ఉన్నాయి. ఓ రకం మీడియా చంద్రబాబు మనవడికి భజన ,మరో ఛానెల్ వైఎస్ జగన్ భజన చేస్తూ పూర్తిగా పార్టీ మీడియాలుగా దిగజారడం గమనార్హం. విశ్వసనీయతకు మారుపేరుగా నిలవాల్సిన మీడియాలు దిగజారి పక్షపాతంగా వార్తలను ప్రజలకు అందించడంపై పాఠకులు మండిపడుతున్నారు.చివరికి జరగని విషయాన్ని కూడా జరిగినట్లుగా ప్రజలకు ఎక్స్‌క్లూజివ్ అంటూ తప్పుడు సమాచారాన్ని అందించడం నిజంగా పాత్రికేయ వృత్తిలో అగ్రశ్రేణి మీడియాలుగా చెలామణి అవుతున్న మీడియాల దిగజారుడుతనానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఇదిలా ఉంటే న్యూస్ స్టూడియోల్లో ఉంటూ చర్చల పేరిట కొందరు సీనియర్ జర్నలిస్టులుగా చెప్పుకుంటూ పూర్తిస్థాయిలో రాజకీయ నేతలుగా మాట్లాడటం సిగ్గుచేటు. రాజకీయ నాయకులు రాజకీయ వ్యాఖ్యలు చేయాలి కానీ ఈ జర్నలిస్టులకు రాజకీయాలతో పనేంటని ప్రజలు ఛీకొడుతున్నారు. ఇంకా కొందరు టీవీ జర్నలిస్టులైతే ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ ప్రజలు తిరగబడాలని, అల్లర్లు, ధ్వంసాలు చేయాలని, ప్రతీకారాలు తీర్చుకోవాలని నేరుగా వ్యాఖ్యానిస్తూ సిగ్గు విడిచి వ్యాఖ్యలు చేయడం చూస్తే వీళ్ళు జర్నలిస్టులా? బరితెగించిన పార్టీ కార్యకర్తలా అని సామాన్య ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితి మనం ఏ ఒక్క మీడియాలో ఉన్నదని చెప్పలేం. దాదాపు తొంభై తొమ్మిది శాతం మీడియాలది ఇదే పరిస్థితి. నిజంగా ఇదంతా పాత్రికేయ ముసుగేసుకుని పార్టీల కోసం పనిచేస్తున్న మీడియాల నీచమైన వ్యవహారం. ఇలాంటి మీడియాలతో మొత్తం పాత్రికేయ వృత్తిపైనే ప్రజల్లో ఏహ్యాభావం ఏర్పడింది.అయితే తమకు నచ్చిన పార్టీల కోసమో లేక తమ సొంత పార్టీల కోసమో మీడియాలు పనిచేయడం ఇదో కొత్తకాదు. ఎప్పటినుంచో ఈ దుర్గతి ఉన్నది.అయితే గతంలో ఇంతలా బరితెగింపు లేదు. కొద్దోగొప్పో ప్రజల కోసం మీడియాలు పనిచేసేవి.తమ రాతలు, చేతల్లో బ్యాలెన్స్,కొన్ని కట్టుబాట్లను పాటించేవి. తమకు ఇష్టమైన పార్టీ కోసమో,తమకు మేలు చేసే నేతకోసమో మరీ బయటపడకుండా వార్తలు రాసేవి. కానీ నేడు ఈ కట్టుబాట్లు, పత్రికా సంప్రదాయాలు పక్కకు పెట్టిన కొన్ని అగ్రశ్రేణి మీడియాలుగా చెలామణి అవుతూ తమ దిగజారుడు వ్యవహారాలు నడపడం ఇప్పుడు చర్చించాల్సిన అం శమే. ఇలాంటి మీడియాల పరువు నానాటికి ప్రజల్లో దిగజారిపోతోంది. ఆ విషయం ఆయా మీడియాల కు తెలుసు. కానీ ప్రజలు ఏం అనుకుంటే మాకేంటి? మాకు కావాల్సింది ధనార్జనే ధ్యేయం. తమకు అనుకూల




ప్రభుత్వం వస్తే మొత్తం ప్రజాధనాన్ని ప్రకటనల పేరిటనో, ఇంకో లాలూచీ వ్యవహారంతోనే దోచేయవచ్చనే దుర్మార్గపు ఆలోచనతోనే ఈ మీడియాలు ఇలా దిగజారి ప్రవర్తిసున్నాయి. అయితే గమ్మత్తయిన విషయం ఏంటంటే మొత్తం పార్టీ పత్రికలుగా ఉండి, ప్రజల కోసం పనిచేయకుండా నీతిని వీడి ఏకపక్షంగా పాత్రికేయాన్ని తాకట్టుపెట్టిన ఇలాంటి మీడియాలే ప్రజల కోసం పనిచేసే చిన్న పత్రికలు, చిన్న మీడియాలపై నిత్యం విషం కక్కుతున్నాయి.  ప్రజల కోసం పనిచేసే నిఖార్సయిన పత్రికలు, మీడియాల విషయంలో అవి మీడియాలే కాదంటూ గగ్గోలు పెడుతుండటం విచిత్రం.అయితే ఇప్పుడు ఇలాంటి మీడియాలకు కాలం చెల్లే రోజులు దగ్గరపడ్డాయి.తాము రాసిందే నిజం..తాము చూపిందే సత్యం అనే సూత్రం డిజిటల్ మీడియా రూపంలో కనుమరుగవుతోంది. ఉన్నది ఉన్నట్లుగా అత్యంత వేగంగా డిజిటల్ మీడియా ప్రజలకు సత్యాన్ని చూపెడుతోంది.ఇప్పుడు డిజిటల్ మీడియా పోటీని తట్టుకోలేని ఈ అగ్రశ్రేణి మీడియాలు ఉక్కిరిబిక్కిరవుతూ ఆగమాగం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తప్పులు మీద తప్పులు చేస్తూ పూర్తిగా దిగజారి తమ ఉణికినే కోల్పోయి ప్రజల్లో ఛీత్కారాలకు గురవుతున్నాయి. మరి ఇలాంటి మీడియాలకు ప్రకటన పేరిట వందల కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని పంచిపెట్టడం సబబా?  ఈ విషయం మీద ప్రజల్లో విరివిగా చర్చ జరగాలి. ప్రభుత్వాలు కూడా ఒక్కసారి పునరాలోచించి నిజమైన జర్నలిజానికి పట్టం కట్టాలి. ఆ దిశగా అన్ని వర్గాలు చర్చించాల్సిన తరుణం ఇదే.

........... మానసాని కృష్ణారెడ్డి,9618616110